భక్తి యోగము



సమ శ్శత్రౌ చ మిత్రేచ తథా మానావమానయోః
శీతోష్ణ సుఖదుఃఖేషు సమస్సంగ వివర్జితః. **(12-18)**

శత్రువునందును, మిత్రునియందును, మానావమానములందును, శీతోష్ణసుఖదుఃఖములందును సమముగ ఉండువాడును, దేనియందును, ఆసక్తి లేనివాడును అగు మనుజుడు నాకు ఇష్టుడు.

ఓం

శ్రీ భగవద్గీత

అథ ద్వాదశోఽధ్యాయః

పండ్రెండవ అధ్యాయము

భక్తియోగః

భక్తియోగము

ఈ అధ్యాయము యొక్క పేరు :–

'భక్తియోగము' – భక్తిని గుఱించి ప్రతిపాదింపబడిన అధ్యాయమగుటచే దీనికి భక్తియోగమను పేరు వచ్చినది. భక్తియొక్క స్వరూపము, భక్తుని లక్షణములు, వివిధ ఆధ్యాత్మిక సాధనములు ఈ అధ్యాయమున పేర్కొనబడినవి. ఈ అధ్యాయము భక్తితో ప్రారంభింపబడి భక్తితో అంతమైనది. ఈ ప్రకారముగ భక్తినిగూర్చియు, భక్తుని గూర్చియు విశేషముగ తెలుపబడుటవలన ఈ అధ్యాయమునకు 'భక్తియోగమ'ను పేరు కలిగినది.

ఈ అధ్యాయమందలి ప్రధాన విషయములు :–

(1) సాకార, నిరాకారోపాసకులను గూర్చిన విషయములు –	(1 శ్లో॥ నుండి 5 శ్లో॥ వఱకు)
(2) భక్తియొక్క మహత్తరఫలము –	(6 శ్లో॥ నుండి 8 శ్లో॥ వఱకు)
(3) వివిధ ఆధ్యాత్మికసాధనలు –	(9శ్లో॥ నుండి 12శ్లో॥ వఱకు)
(4) భక్తుని లక్షణములు –	(13 శ్లో॥ నుండి 20 శ్లో॥ వఱకు)

పూర్వాధ్యాయముతో ఈ అధ్యాయమునకు గల సంబంధము :–

రెండవ అధ్యాయము మొదలుకొని పదునొకండవ అధ్యాయమువఱకును భగవానుడు కొన్నిచోట్ల నిర్గుణబ్రహ్మోపాసన, అక్షరపరబ్రహ్మతత్త్వము, జ్ఞాననిష్ఠలను బోధించుచు మఱికొన్నిచోట్ల (విభూతియోగ విశ్వరూపసందర్శనాది యోగములందు) సగుణబ్రహ్మోపాసనను, సాకారార్చననుగూడ తెలుపుచువచ్చిరి. తుట్టతుదకు విశ్వరూపమును జూపిరి. విశ్వరూపమును ఉపసంహరించినమీదట పలికిన 'మత్కర్మకృత్', 'మత్పరమః', 'మద్భక్తః' మున్నగు వచనములు సగుణోపాసనను మిక్కిలి బలపఱచునవియై యున్నవి. పూర్వము భగవానుడు తెలిపిన అక్షర, నిరాకార, ఆత్మోపాసనకు సంబంధించిన విషయములు అర్జునుని మనంబున నాటుకొని యుండుటచేతను, ఇపుడు తిరిగి సాకారోపాసనాసంబంధములైన వాక్యములను వినుట వలనను వెంటనే అర్జునునకు సంశయమొదవ, 'సాకారనిరాకారోపాసకుల' లో ఎవరు శ్రేష్ఠులు? అని ఈ (12వ) అధ్యాయప్రారంభమున భగవానుని ప్రశ్నించుచున్నాడు. అర్జునుని యా ప్రశ్నతో ఈ అధ్యాయము ప్రారంభమగుచున్నది.

అర్జున ఉవాచ :-

1. ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే
యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః.

అర్జునఉవాచ = అర్జునుడు చెప్పెను.

టీక:- ఏవమ్ = ఈ ప్రకారముగ (11వ అధ్యాయముచివఱ చెప్పబడినవిధముగ), సతతయుక్తాః = ఎల్లప్పుడు మీయందే మనస్సును నెలకొల్పినవారై, యే భక్తాః = ఏ భక్తులు (సగుణోపాసకులు), త్వామ్ =మిమ్ము, పర్యుపాసతే = ఉపాసించుచున్నారో, యే చ అపి = ఎవరైతే, అవ్యక్తమ్ = ఇంద్రియములకు గోచరముకాని, అక్షరమ్ = నాశరహితపరబ్రహ్మమును, పర్యుపాసతే = ధ్యానించుచున్నారో, తేషామ్ = ఆ యిరుతెగలవారిలో, కే = ఎవరు, యోగవిత్తమాః = యోగమును బాగుగ నెఱిగినవారు.

తా:- అర్జునుడు చెప్పెను - ఈ ప్రకారముగ ఎల్లప్పుడు మీయందే మనస్సును నెలకొల్పినవారై ఏ భక్తులు మిమ్ముపాసించుచున్నారో, మఱియు ఎవరు ఇంద్రియగోచరముగాని అక్షరపరబ్రహ్మను ధ్యానించుచున్నారో, ఆ యిరుతెగలవారిలో యోగమును బాగుగ నెఱిగిన వారెవరు?

వ్యాఖ్య:- 'ఏవమ్' అను పదము క్రిందటి అధ్యాయముయొక్క 55వ శ్లోకమగు 'మత్కర్మకృత్' అను శ్లోకముయొక్క భావమును సూచించుచున్నది.

భగవానుని విశ్వరూపమునుగాని, లేక దైవసంబంధమైన వేఱొకమూర్తినిగాని, సాకార స్వరూపమునుగాని, అనవరత భక్తితో, ఉపాసించువారు (సగుణోపాసకులు) గొప్పా? లేక ఇంద్రియములకు గోచరముకాని, నిరాకారమైన, సర్వవ్యాపకమైన, అక్షర పరమాత్మను ధ్యానించువారు (నిర్గుణోపాసకులు) గొప్పా? అని అర్జునుని ప్రశ్న. ఇదివఱలో అనేకమార్లు భగవానుడు (2వ అధ్యాయము 8వ అధ్యాయము మున్నగుచోట్ల) నిర్గుణపరమాత్మయొక్క తత్త్వమునుగూర్చి, ధ్యానమునుగూర్చి తెలిపియుండిరి. ఇపుడు విశ్వరూపమునుజూపి, సగుణోపాసనను బలపఱచిరి. కావున రెండిటిలో ఏదిశ్రేష్ఠమను భావము అర్జునునకు కలుగుట సహజమే అయియున్నది -

అ॥ అర్జునుని యా సంశయమును భగవానుడు తీర్చివైచుచున్నాడు -

శ్రీ భగవానువాచ -

2. మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే
శ్రద్ధయా పరయోపేతా స్తేమే యుక్తతమా మతాః.

శ్రీ భగవానువాచ = శ్రీ భగవంతుడు చెప్పెను.

టీక:- మయి = నాయందు, మనః = మనస్సును, ఆవేశ్య = నిలిపి, నిత్యయుక్తాః = నిరంతర దైవచింతనాపరులై (తదేకనిష్ఠులై), పరయా = మిక్కిలి, శ్రద్ధయా = శ్రద్ధతో, ఉపేతాః = కూడుకొనినవారై, యే = ఎవరు, మామ్ = నన్ను, ఉపాసతే = ఉపాసించుచున్నారో, తే = వారు, యుక్తతమాః = ఉత్తమయోగులని, మే మతాః = నాయొక్క అభిప్రాయము.

తా:— శ్రీ భగవంతుడు చెప్పెను - నాయందు మనస్సును నిలిపి నిరంతర దైవచింతనాపరులై (తదేకనిష్ఠులై) మిక్కిలి శ్రద్ధతో గూడుకొనినవారై యెవరు నన్నుపాసించుచున్నారో వారే ఉత్తమయోగులని నా యభిప్రాయము.

వ్యాఖ్య:— అర్జునుని ప్రశ్నకు భగవానుడు చక్కటిసమాధాన మొసంగిరి. సగుణోపాసకులు శ్రేష్ఠులా? నిర్గుణోపాసకులు శ్రేష్ఠులా? యను ప్రశ్నకు ఎవరైనను సరియే మిక్కిలిశ్రద్ధతో గూడుకొని నిరంతరము దైవాయత్తచిత్తులైయుందురో వారే శ్రేష్ఠులని శ్రీకృష్ణుడు ప్రత్యుత్తరమొసంగిరి. ఇచట మూడుసాధనలు చెప్పబడెను.

(1) మనస్సును పరమాత్మయందు నిలుపుట.

(2) నిరంతరము దైవచింతనాపరులై యుండుట.

(3) మిక్కిలి శ్రద్ధతో గూడుకొనియుండుట.

ఈ మూడింటిని అనుష్ఠించువాడెవడో అతడు సర్వశ్రేష్ఠుడగు యోగిగాని, సగుణోపాసకుడా, నిర్గుణోపాసకుడా, సన్న్యాసియా, గృహస్థుడా, ద్విజుడా, ద్విజేతరుడా - అను ప్రశ్నయే ఇచట లేదు. ఆహా! భగవాను డెట్టి విశాలభావమును ప్రకటించిరి! భక్తికి, శ్రద్ధకు, ఏకాగ్రతకు, ప్రాధాన్యమొసంగిరే కాని ఒకానొకమార్గమునకు, సంప్రదాయమునకు గాదు.

అ॥ నిర్గుణోపాసకులను గుఱించి ఒకింత చెప్పుచున్నాడు -

3. యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే
సర్వత్రగమచిన్త్యం చ కూటస్థమచలం ధ్రువమ్.
4. సంనియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః
తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః.

టీక:— యే తు = ఎవరైతే, ఇన్ద్రియగ్రామమ్ = ఇంద్రియముల సమూహమును, సంనియమ్య = లెస్సగ స్వాధీనపఱుచుకొని, సర్వత్ర = అంతటను, సమబుద్ధయః = సమానభావముగలవారై, సర్వభూతహితేరతాః = సమస్తప్రాణులకును హితమును గలుగజేయుటయం దాసక్తిగలవారై, అనిర్దేశ్యమ్ = ఇట్టిదని సూచింప నలవికానిదియు, అవ్యక్తమ్ = ఇంద్రియగోచరము కానిదియు (లేక, ఏ ప్రమాణముచేతను దెలియబడనిదియు), అచిన్త్యమ్ = చింతింప నలవికానిదియు (ఊహింపశక్యముకానిదియు), కూటస్థమ్ = నిర్వికారమైనదియు (ప్రపంచమున కధిష్ఠానమైనదియు), అచలమ్ = చలింపనిదియు, ధ్రువమ్ = నిత్యమైనదియు, సర్వత్రగం చ = అంతటను వ్యాపించినదియు నగు, అక్షరమ్ = నాశరహితమగు (నిర్గుణ) పరబ్రహ్మమును, పర్యుపాసతే = ధ్యానించుచున్నారో, తే = వారు, మామ్ ఏవ = నన్నే, ప్రాప్నువన్తి = పొందుచున్నారు.

తా:— ఎవరు ఇంద్రియములన్నిటిని బాగుగ నిగ్రహించి (స్వాధీనపఱచుకొని) ఎల్లెడల సమభావముగలవారై, సమస్తప్రాణులకును హితమొనర్చుటయం దాసక్తిగలవారై, ఇట్టిదని నిర్దేశింప శక్యముకానిదియు, ఇంద్రియములకు గోచరముకానిదియు, చింతింపనలవికానిదియు, నిర్వికారమైనదియు,

చలించనిదియు, నిత్యమైనదియు, అంతటను వ్యాపించియున్నదియు నగు అక్షరపరబ్రహ్మమును ధ్యానించుచున్నారో, వారు నన్ను పొందుచున్నారు.

వ్యాఖ్య:– ఒకే పరమాత్మ సాకారముగను, నిరాకారముగను ఉండుటవలన, సగుణధ్యానమునకుగాని, నిర్గుణధ్యానమునకుగాని లక్ష్యము ఒకటియే అయియున్నది. శ్రద్ధతోను, నిర్మలభక్తితోను ఏ ప్రకారము ధ్యానించినను జనులు పరమాత్మనే చేరుదురు. ఈ రెండు శ్లోకములందును నిర్గుణపరబ్రహ్మమును ధ్యానించువారిని గుఱించి చెప్పబడినది. ఇందు మొదటి శ్లోకమున బ్రహ్మమునుగూర్చిన విశేషణములున్ను, రెండవ శ్లోకమున బ్రహ్మప్రాప్తికివలసిన శీలసంపత్తియు తెలుపబడినవి. సాధకుడు సాధ్యవస్తువగు పరమాత్మను ధ్యానించుచున్నప్పటికిని, హృదయశుద్ధిలేనిచో, ఇంద్రియ నిగ్రహము గల్గియుండనిచో, ప్రాణికోట్లయెడల దయలేనిచో ఆ ధ్యానము చక్కని ఫలితము నొసంగజాలదు. అట్టి వానికి బ్రహ్మానుభూతికలుగుటదుస్తరము. అతని ఉపాసన కళాయిలేని పాత్రలోవండిన పప్పుపులుసువలె నుండును. వస్తువులన్నియు మంచివి అయినను పాత్ర శుద్ధముగాలేనిచో ఆ పులుసెట్లు చిలుమెక్కిపోయి నిరుపయోగమగునో, అట్లే హృదయశుద్ధి, ఇంద్రియనిగ్రహము, భూతదయ మున్నగు పవిత్రగుణములులేక భగవంతుని నిరాకారముగగాని, సాకారముగగాని యెట్లుపాసించినను పూర్ణఫలితము కలుగదు. కనుకనే గీతాచార్యులు ధ్యానశీలురను హెచ్చరించుటకు కాబోలు, ధ్యాతకు వలసిన మూడు గొప్ప సుగుణములను ఇచట నిర్గుణబ్రహ్మోపాసనాఘట్టమున పేర్కొనిరి. అవి యేవియనిన –

(1) ఇంద్రియ సమూహమును లెస్సగ అరికట్టుట (సంనియమ్యేన్ద్రియగ్రామం)

(2) ఎల్లెడల సమభావము గలిగియుండుట (సర్వత్రసమబుద్ధయః)

(3) సమస్తప్రాణులకు హితమునాచరించుట (సర్వభూతహితేరతాః)

కాబట్టి ముముక్షువులు ధ్యానాదులను సల్పుచు ఈ సుగుణత్రయమును బాగుగ అలవఱచుకొనవలెను. ఇచట 'నియమ్య' అని చెప్పక 'సంనియమ్య' అని చెప్పుటవలన ఇంద్రియములను ఒకింత నిగ్రహించిన చాలదనియు లెస్సగ నిగ్రహించవలెననియు, 'సర్వత్ర' అని పేర్కొనుటవలన సమస్తప్రాణులందును, లేక ఎల్లకాలమందును సమభావము గలిగియుండవలెననియు, 'సర్వభూతహితేరతాః' అని చెప్పుటచే ఏ ఒకానొక ప్రాణియెడల దయగలిగియుండుట చాలదనియు, సమస్తప్రాణికోట్లయెడ ప్రేమ, దయ, ఉపకారబుద్ధి గలిగియుండవలెననియు స్పష్టమగుచున్నది. ఈ ప్రకారములగు సుగుణములుగల్గి పరమాత్మను ధ్యానించుచో వారు తప్పక ఆ పరమాత్మను జేరగలరని 'తేప్రాప్నువన్తి' అను వాక్యముచే భగవానుడు నిశ్చయపూర్వకముగ తెలుపుచు సర్వులకును అభయమొసంగుచున్నారు. కావున భగవద్ధ్యానపరుడు పైమూడు సుగుణములను తనయందున్నవా, లేవా యని పరీక్షించుకొనవలయును.

అ॥ సగుణనిర్గుణోపాసనల రెండిటిలో, నిర్గుణోపాసన (సామాన్యులకు) కష్టతరమనియు, దేహభావనగలవారి కయ్యది బహుప్రయాసగ నుండుననియు వచించుచున్నాడు –

5. క్లేశో౽ధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్
అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే.

టీక:– అవ్యక్తాసక్తచేతసామ్ తేషామ్ = ఇంద్రియగోచరముకాని పరమాత్మయందు

(నిర్గుణబ్రహ్మమందు) ఆసక్తిగల మనస్సుగలవారికి, *క్లేశః* = కష్టము, *అధికతరః* = మిక్కిలి అధికమైనది, *హి* = ఏలయనగా, *అవ్యక్తా* = నిర్గుణవిషయమైన, *గతిః* = మార్గము, *దేహవద్భిః* = దేహాభిమానము గలవారిచేత, *దుఃఖమ్* = అతికష్టముగా, *అవాప్యతే* = పొందబడుచున్నది.

తా:– అవ్యక్త (నిర్గుణ) పరబ్రహ్మమునం దాసక్తిగల మనస్సుగలవారికి (బ్రహ్మమందు నిష్ఠను బొందుటలో సగుణోపాసకులకంటె) ప్రయాస చాల అధికముగ నుండును. ఏలయనిన, నిర్గుణోపాసనా మార్గము దేహాభిమానముగలవారిచేత అతికష్టముగా పొందబడుచున్నది.

వ్యాఖ్య:– నిర్గుణోపాసనామార్గము దేహాభిమానముగలవారికి చాల ప్రయాసగ నుండునని యిచట తెలుపబడినది. అదిలేనివారికి చాల సులభముగనుండును. అనగా దేహాహంభావములేక, ఇంద్రియనిగ్రహముగలిగి, నిష్కామకర్మానుష్ఠానముచేతను, ఈశ్వరోపాసనచేతను చిత్తశుద్ధిని బడసినవారికి నిర్గుణోపాసనయందేమియు కష్టముండదు. ఈ శ్లోకముయొక్క మొదటిపాదమునందు నిర్గుణోపాసన అధికతరక్లేశవంతమై యుండుననిచెప్పుట దేహాభిమానముగలవారికే యనియు, ఇంద్రియనిగ్రహములేనివారికే యనియు, సగుణోపాసనచే చిత్తశుద్ధిని బడయనివారికే యనియు గ్రహించవలెను. దేహాభిమానములేనివారికి, ఇంద్రియనిగ్రహముకలవారికి నిర్గుణమార్గము అతిసులభముగనున్నదై జీవుని పరమాత్మసాన్నిధ్యమునకు తప్పక చేర్చగలదని వెనుకటి శ్లోకములందు భగవానుడు చెప్పియేయుండిరను విషయమును ఈ సందర్భమున జ్ఞాపకమునకు తెచ్చుకొనవలెను.

కాబట్టి సాధకులు మొట్టమొదటనే అవ్యక్త (నిరాకార, నిర్గుణ) మార్గమునకై పరువిడక, దేహాభిమానమను దోషమును భగవదుపాసన, నిష్కామకర్మాద్యనుష్ఠానముల వలన తొలగించుకొని, ఇంద్రియనిగ్రహమును అభ్యసించి క్రమముగ నిర్గుణపరబ్రహ్మమందు చిత్తమును ప్రవేశింపజేసినచో అత్తఱి ఏ ప్రయాసలేకయే దైవప్రాప్తిరూపలక్ష్యము సిద్ధించగలదు. పరమార్థరంగమున ప్రవేశించి సాధకులనేకులు బ్రహ్మమునుగూర్చి ఉపాసనాదుల సలుపుచున్నను ఉత్తమఫలితములను బొందజాలకపోవుటకు కారణ మీశ్లోకమున చక్కగ తెలుపబడినది. క్షేత్రమును శుద్ధపఱచక విత్తనము వేసినచో ఏమిలాభము? పునాది గట్టిగలేక మేడ కట్టినచో నిలుచునా? అట్లే హృదయమందలి దేహాభిమానము మున్నగునవి తొలగనిచో బ్రహ్మమందు మనస్సు నిలవదు. సాధకులీవిషయమును బాగుగ జ్ఞప్తియందుంచుకొనవలెను. వాస్తవముగ ధ్యానముగాని, ఉపాసనగాని ఎంతయో ఆనందకరమైన పరిస్థితి. అది సచ్చిదానందసాగరమును గూర్చిన విషయముకదా! అందు కష్టమెందులకుండును? అది ప్రయాసను పోగొట్టునదేకాని, కలుగజేయునదికాదు. కాని జనులు దానిని ఆచరించుపద్ధతిని తెలుసుకొనజాలక దేహాభిమానవశమున కష్టమనుభవించుచున్నారు. కావున సగుణోపాసనమున కొంతకాలము మెలిగి, దేహాభిమానమును పోగొట్టుకొని తదుపరి నిర్గుణోపాసన నవలంబించుట ఉత్తమోత్తమము.

అ॥ అనన్యభావముతో తన్నుగూర్చి ధ్యానించువారిని సంసారసాగరమునుండి ఉద్ధరించెదనని రెండు శ్లోకములద్వారా భగవానుడు చెప్పుచున్నాడు –

6. యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయన్త ఉపాసతే.

7. తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్
భవామి న చిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్.

టీక:– పార్థ= ఓ అర్జునా!, యేతు= ఎవరైతే, సర్వాణి= సమస్తములైన, కర్మాణి= కర్మములను, మయి = నాయందు, సన్న్యస్య = సమర్పించి, మత్పరాః = నన్నేపరమగతిగాదలంచినవారై (లేక నాయందే చిత్తముగలవారై), అనన్యేన యోగేన = (పరమాత్మ తప్ప) ఇతరమునుదేనిని దలంపని యోగముచే (అనగా ఇతరచింతన లెవ్వియులేక), మామ్ ఏవ = నన్నే, ధ్యాయన్తః = చింతించుచున్నవారలై, ఉపాసతే = ఉపాసించుచున్నారో, మయి = నాయందు, ఆవేశితచేతసామ్ = ఉంచబడిన చిత్తముగల, తేషామ్ = అట్టివారికి (అట్టివారిని) అహమ్ = నేను, మృత్యుసంసారసాగరాత్ = మృత్యురూపమగు (మరణాద్యనర్థములను గలుగజేయు) సంసారమను సముద్రమునుండి, న చిరాత్ = శీఘ్రముగ, సముద్ధర్తా = బాగుగలేవనెత్తువాడను, భవామి = అగుచున్నాను.

తా:– ఓ అర్జునా! ఎవరు సమస్తకర్మములను నాయందు సమర్పించి, నన్నేపరమగతిగ దలంచినవారై, అనన్యచిత్తముతో నన్నేధ్యానించుచు ఉపాసించుచురో, నాయందు చిత్తమునుజేర్చిన అట్టివారిని మృత్యురూపమగు ఈ సంసారసముద్రమునుండి నేను శీఘ్రముగ బాగుగ లేవదీయుచున్నాను.

వ్యాఖ్య:– ఇందు మొదటిశ్లోకమున సాధకుడు అనుసరించవలసిన పద్ధతిని, రెండవ శ్లోకమున దానియొక్క అఖండఫలితమును భగవానుడు తెలియజేసిరి. ఆ పద్ధతి యేదియనిన (1) సమస్తకర్మములను భగవంతునకు సమర్పించుట (2) వారినే పరమ గతిగ ఎన్నుకొనుట, లేక వారియందే చిత్తమును నెలకొల్పుట (3) అనన్యభావముతో (ఏకాంతభక్తితో) అట్టి పరమాత్మను ధ్యానించుట - ఈ ప్రకారము భక్తితో తన్నుపాసించువారలను సర్వేశ్వరుడు జననమరణరూపమగు ఈ సంసారసాగరమునుండి లెస్సగ ఉద్ధరించెదరని పలుకుచున్నారు. ఓహో! ఎట్టి మహత్తరఫలితము భగవదుపాసకులకు లభించుచున్నది! భయంకరమై, మరణరూపమైనట్టి ఈ సంసారసముద్రమున మునిగితేలుచు, నానాయాతనలను బొందుచున్న ఈ జనానీకమున కిట్టి వాక్యము లెంతటి ఆశ్వాసమును గలుగజేయగలవు! అనాదికాలమునుండి సంసారరూపమగు ఈ ఘోరవిపత్తునందు తగుల్కొని బద్ధుడై 'పునరపి జననం, పునరపి మరణం' అనునట్లు కాలచక్రమున పరిభ్రమించుచు అల్లాడిపోవుచున్న జీవునకు భగవత్ప్రోక్తములగు ఈవాక్యములు సంజీవివంటివేయగును. మునుగుచున్నవానికి నావయెట్టిదో సంసారదుఃఖబాధితునకు భగవంతుడట్టివారు. ఎంత గొప్పసముద్రమైనను ఒక చిన్ననావచే దాటబడునట్లు భక్తియను తెప్పచే సంసారసముద్రమును దాటవచ్చును. మిమ్ములను 'తప్పకలేవనెత్తెదను' (సముద్ధర్తా) అని భగవానుడు కరుణతో పలుకుచున్నాడు. అయితే ఎవరు హస్తమును పైకి జాచి వారి అనుగ్రహమును వాంఛించుదురో అట్టివారినే లేవనెత్తుదురుగాని తక్కినవారినికాదు. ఎవరువారినిగూర్చి చింతింపరో, ధ్యానింపరో, అట్టి వారి యుద్ధరణమునుగూర్చి వారు పట్టించుకొనరు. వారీదుఃఖసాగరమున ఇంకెంతయో కాలము తిరుగాడవలసివచ్చును. జీవుడు తాను చేయవలసినదానిని చేసినచో భగవంతుడు తాను గావించవలసిన సముద్ధరణమును తాను గావించును. కాబట్టి విజ్ఞుడగువాడు తాను అనుభవించుచున్న సంసారసాగరనిమజ్జనరూప ఘోరవిపత్తును గుర్తెఱిగి మరణాదిబాధలను సంపూర్ణముగ తొలగించుకొనుటకై భగవానుని వెంటనే భక్తిపూర్వకముగ సేవించవలెను. భవరోగవినాశనమున కిదియే సముచిత భేషజము.

యే తు - అని చెప్పినందువలన ఎవరైనను సరియే (జాతి మత కుల భేదములేక) భగవంతు నాశ్రయించి తరింపవచ్చునని స్పష్టమగుచున్నది.

'సర్వాణి కర్మాణి.' అనుటచే ఏవియో కొన్ని కర్మలను సమర్పించుట కాదనియు, తానుజేయు సమస్తకర్మలను ఈశ్వరార్పణము గావింపవలయుననియు భావము.

అనన్యేనైవ యోగేన. - ఇంతవఱకు కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము మున్నగు అనేక యోగములను చెప్పి చెప్పి ఇపుడొక క్రొత్తయోగమును భగవానుడు లేవదీసెను. అదియే అనన్యయోగము. ఇది ప్రత్యేకమగు ఒకయోగము కాకున్నను అన్ని యోగములతో ఇది చేరిననే అవి రాణించును. ఏ యోగమైనను అనన్యచిత్తముతో నాచరించినచో మాత్రమే ఫలవంతమగును. ఇతరములగు ప్రాపంచిక చింతనలు, దృశ్యసంకల్పములు మనస్సునకు రానీయక కేవలము పరమాత్మవస్తువొక్కదానినే చింతించుచుండవలెనని దాని భావము.

'మాం ధ్యాయన్త ఉపాసతే' - 'మాముపాసతే' అని చెప్పక 'ధ్యాయన్తః' అని కూడ దానికి చేర్చుటవలన సామాన్యమగు ఉపాసనకంటె అర్థభావనతో గావింపబడు ఉపాసనయే శ్రేష్ఠతమమని, అదియే అవలంబనీయమని బోధించినట్లైనది. మంత్రజపము చేయునపుడు మంత్రోచ్చారణతోబాటు మంత్రార్థమునుగూడ నెట్లుభావించవలెనో, అట్లే భగవంతుని ఉపాసించునపుడును వారి స్వరూపస్వభావాదులను బాగుగ చింతన జేయవలెను. 'తత్ర ప్రత్యయైకతానతా ధ్యానమ్' - అను పతంజలి యోగసూత్ర మీ భావమునే తెలుపుచున్నది.

'సముద్ధర్తా' - 'ఉద్ధర్తా' అని గాక సముద్ధర్తా అని పేర్కొనుటవలన అట్టి భగవదుపాసకులను తాను లెస్సగ సముద్ధరించెదనని భగవానుడు తెలిపినట్లైనది.

'మృత్యు సంసారసాగరాత్' - సంసారమును సముద్రమునకు పోల్చిచెప్పిరి. సముద్రమువలె భయంకరమై, కామాది దుష్ట జల జంతువులతోగూడి అపారమైయుండుటవలన ఆప్రకార మది సాగరమునకు పోల్చి చెప్పబడినది. అయితే అనేకులు సంసారసుఖములు మహా ఆనందకరములని, కావున సంసారస్థితి అభిలషణీయమని పలుకుచుందురు. అజ్ఞానము వలననే వారట్లు చెప్పుచుందురు. సంసారస్థితియొక్క వాస్తవస్వరూపము వారి కింకను తెలియలేదని యర్థము. దాని యథార్థరూపమును భగవానుడిచట బయటపెట్టిరి - అది 'మృత్యు' సంసారమని వారు వర్ణించిరి. అనగా మరణరూపమైనదని, పుట్టుక చావులతో గూడినది యని భావము. కాబట్టి ఈ మృత్యుసంసారమధ్యమున తగుల్కొనిన జీవుడు అమరత్వసిద్ధికై అమృతస్వరూపుడగు భగవానుని, సచ్చిదానందప్రభువును తప్పక ఆశ్రయించవలసియున్నాడు.

'న చిరాత్' అని చెప్పుటవలన భగవదాశ్రయముచే జీవుడు శీఘ్రముగ విముక్తి నొందగలడని తెలియుచున్నది. (దృష్టాంతము - గజేంద్రుడు, **ప్రహ్లాదుడు** అంబరీషుడు, ద్రౌపది).

ప్ర:- ఈ సంసారస్థితి యెట్టిది?

ఉ:- అది (1) సముద్రమువలె భయంకరమైనది, అపారమైనది. (2) మృత్యురూపమైనది (జననమరణములతో గూడినది).

ప్ర:- దానినుండి తప్పించుకొనుట యెట్లు?

ఉ:- భగవంతుని ఆశ్రయించినచో ఆతడే ఆ సంసారసాగరమునుండి జీవుని సముద్ధరించును.

ప్ర:— భగవానుని ఏ ప్రకార మాశ్రయించవలెను?

ఉ:— (1) సమస్తకర్మలను భగవానునకర్పించి (2) ఆతనినే పరమగతిగా భావించి (3) చిత్తము నాతనియందే నెలకొల్పి (4) ఆతనినే చింతింపజేయుచు (ధ్యానించుచు) ఉపాసించవలెను.

ప్ర:— అట్లు ధ్యానించువారికి కొన్ని సాధనాక్రమములను నాలుగు శ్లోకములద్వారా తెలియజేయబోవుచు మొట్టమొదట మనస్సును తనయందు నిలుపవలసినదిగా శ్రీకృష్ణమూర్తి బోధించుచున్నాడు -

8. మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ
నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః.

టీక:— మయి ఏవ = నాయందే, మనః = మనస్సును, ఆధత్స్వ = స్థిరముగా నిలుపుము, మయి = నాయందు, బుద్ధిమ్ = బుద్ధిని, నివేశయ = ప్రవేశపెట్టుము, అతః ఊర్ధ్వమ్ = అటు పిమ్మట, మయి ఏవ = నాయందే, నివసిష్యసి = నివసింపగలవు, సంశయః = (ఈవిషయమున) సందేహము, న = లేదు.

తా:— నాయందే మనస్సును స్థిరముగానిలుపుము. నాయందే బుద్ధిని ప్రవేశపెట్టుము. పిమ్మట నాయందే నివసింతువు. సందేహములేదు.

వ్యాఖ్య:— విద్యార్థికి ఉపాధ్యాయు డెట్లు పాఠములను బోధించునో, ఆప్రకారముగ భగవాను డర్జునున కిపుడు ఒకటితరువాత మఱియొకటిగ పెక్కుసాధనలను తెలియజేయబోవుచున్నాడు. ప్రప్రథమమున మనస్సును, బుద్ధిని పరమాత్మయందు స్థిరముగ నిలుపులాగున ఆనతిచ్చిరి. ఇది మొదటి పాఠము. మనస్సునుమాత్రము నిలిపినచాలదా, బుద్ధినికూడ ఏలజోడించవలెను? అని ప్రశ్నించినచో, బుద్ధి నిశ్చయము చేయునది కావున, అదిలేనిచో మనస్సు సంకల్పవికల్పములతో గూడియున్నదైచంచలముగ నుండును. మనస్సు సంకల్పించును, బుద్ధి నిశ్చయించును. కాబట్టి భగవద్విషయమై దృఢమగు నిశ్చయమును గలుగజేయునది బుద్ధియే, కావున దానినిగూడ మనస్సుతో చేర్చిచెప్పిరి. అట్లు మనోబుద్ధుల రెండిటిని ఇతరమైన దృశ్యవస్తువుల వేనియందును ప్రవేశింపనీయక ఒక్కభగవంతునియందే సంలగ్నమైయుండులాగున ప్రయత్నించవలెను. అట్లుచేసినచో నిక మనుజుడు ధ్యేయవస్తువగు ఆ పరమాత్మయందే సదానివసింపగలడు. ఆహా! ఎంతటి గొప్పస్థానమం దతడు నివాసము బడయును! ఉప్పుకల్లు సముద్రమునందు లయించునట్లు మనస్సు నిరంతరము దేనినిగూర్చి ధ్యానించునో, దేనియందు సంలగ్నమైయుండునో, దానియందే లయించి తదాకారాకారితమై యొప్పును. కావున అనవరతము భగవంతునియందు స్థిరముగనుండునట్టి మనస్సు క్రమముగ ఆ దైవాకారమునే పొందిపోవును. అదియే మోక్షము. దేవునియందు నివసించుట యనగా నిదియే. ఇవ్విషయమున ఏ మాత్రము సందేహములేదనియు, ఇది పరమసత్యమనియు భగవానుడు తెలియజేసిరి. కాబట్టి సాధకులు తమ మనస్సును అన్యత్రపోనీయక ధ్యానాదుల ద్వారా ప్రయత్నపూర్వకముగ భగవంతునియందు నిలిపినచో ఇక తమ మోక్షవిషయమై ఏలాటి సంశయమున్ను పెట్టుకొన నక్కరలేదని స్పష్టమగుచున్నది.

'న సంశయః' - 'ఈ విషయమున సంశయములేదు' అని సాక్షాత్ భగవానుడే చెప్పినందువలన ఇక సాధకుల కీ వాక్యములపై ఎంతటి విశ్వాసముండవలెనో ఊహించుకొనుడు.

'మయి ఏవ' - (నాయందే) అని 'ఏవ' పదప్రయోగముచేయుటవలన, దైవముపైతప్ప ఇతరమగు దేనిపైనను దృష్టిని పోనీయరాదని (మనస్సును నిలుపరాదని) భావము.

ప్ర:– మనస్సును, బుద్ధిని ఎచటనుంచవలెను?

ఉ:– భగవంతునియందు.

ప్ర:– అట్లుంచుటవలన ప్రయోజనమేమి?

ఉ:– అత్తఱి భగవంతునియందే యాతడు నివసింపగలడు (ఇట ఏలాటి సంశయములేదు).

అ॥ ఒకవేళ మనస్సు దైవమందు స్థిరముగ నిలవనిచో అప్పుడేమిచేయవలెనో చెప్పుచున్నాడు -

9. అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనఞ్జయ.

టీక:– *ధనంజయ* = ఓ అర్జునా!, *అథ* = ఇక (ఒకవేళ), *చిత్తమ్* = మనస్సును, *మయి* = నాయందు, *స్థిరమ్* = స్థిరముగ, *సమాధాతుమ్* = నిలుపుటకు, *న శక్నోషి (యది)* = శక్తుడవు కానిచో, *తతః* = అటుపిమ్మట, *అభ్యాసయోగేన* = అభ్యాసమను యోగముచేత, *మామ్* = నన్ను, *ఆప్తుమ్* = పొందుటకు, *ఇచ్ఛ* = కోరుము.

తా:– ఓ అర్జునా ఒకవేళ ఆ ప్రకారము మనస్సును నాయందు స్థిరముగ నిలుపుటకు నీకు శక్తిలేనిచో అత్తఱి అభ్యాసయోగముచే నన్ను పొందుటకు ప్రయత్నింపుము. (అభ్యాసముచే ఆ స్థితిని ఎట్లైనను సాధింపుమని భావము).

వ్యాఖ్య:– మొదట తెల్పిన సాధన చేయలేనివారికి భగవానుడు మఱికొన్ని ప్రత్యామ్నాయపద్ధతులను సూచించుచున్నారు. ఆహా! భక్తులపై, సాధకులపై సర్వేశ్వరునకు ఎంతటి కరుణ! మనస్సుచేతనే బంధము, మనస్సుచేతనే మోక్షము జీవునకు కలుగుచున్నవి★. కాబట్టి మోక్షము పొందుటకు ఆ మనస్సు ఏదోవిధముగ అధిష్ఠానమగు పరమాత్మయందు (దైవమందు) లయించియే తీరవలెను. ఇక్కారణముననే గీతాచార్యులు మనస్సు దైవమందు నిలుకడను బొందనిచో అభ్యాసముచే నెట్లైనను దానిని నిలుకడబొందులాగున చేయవలయునని, (అది తప్ప మోక్షమునకు వేఱుదారిలేదని) తెలియజేయుచున్నారు. ప్రతివారును ఏదియోవిధముగ తమ మనస్సును బహిర్ముఖముగ పోనీయక, దృశ్యవిషయములపై వ్రాలనీయక, ఆత్మయందు (దైవమందు) స్థాపనచేయవలెను. ఒకవేళ ప్రారంభస్థితిలో అట్లు మనస్సు ధ్యేయమందు నిలుకడను బొందనిచో అభ్యాసముచే మెల్లమెల్లగా ఆ స్థితిని ఎట్లైనను సాధించియే తీరవలెను. మనస్సు ఆత్మయందు లయించి, ఆత్మరూపమున శేషించుటయే మోక్షము. కావున ఆ స్థితిని ప్రయత్నపూర్వకముగ అభ్యాసము ద్వారా ప్రతివారును సాధించవలెను. 'యతో యతో నిశ్చరతి .... (6-26)' అని 6వ అధ్యాయమున భగవానుడు తెలియజేసినరీతి చపలమనస్సును నెమ్మదిగా వశమొనర్చుకొని ఆత్మయందు (దైవమందు) స్థాపించవలెను. ఇట్టి అభ్యాసమునుగూర్చియే ఈ శ్లోకమందు తెలియజేయబడినది.

★ మన ఏవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః (అమృతబిందూపనిషత్తు - 10)

'అభ్యాసయోగేన' - ఈ అభ్యాసమనుయోగము కర్మయోగ, భక్తియోగ, ధ్యానయోగ, జ్ఞానయోగాదులన్నిటితోను కూడియుండవలెను. అన్ని యోగములకును 6వ శ్లోకమున తెలుపబడిన అనన్యయోగము, ఈశ్లోకమందు తెలుపబడిన ఈ అభ్యాసయోగము ఆవశ్యకమైయున్నది. దీనితో చేరినపుడే తక్కిన యోగములన్నియు అభివృద్ధిని, వికాసమును బొందగలవు.

కొందఱు సాధకులు గురువులయొద్దకువెళ్ళి 'అయ్యా! ధ్యానకాలమున నా మనస్సు దైవమందు స్థిరముగ నిలుచుటలేదే? ఏమి చేయవలెను?' అని యడుగుచుందురు. అందులకు ప్రత్యుత్తరముగ వారు భగవానుడీశ్లోకమున తెలిపినదానినే చెప్పుదురు. 'నాయనలారా! మనస్సు నిలువనిచో, అభ్యాసముచేసి ఎట్లైనను నిలుచులాగున చేసికొనుడు. వేఱుదారిలేదు' అని వారు బోధించుదురు. మనోనిగ్రహమును గూర్చి 6వ అధ్యాయమున 'అభ్యాసేనతు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే' అను వాక్యము ద్వారా భగవానుడీ అభ్యాసమునే నొక్కిచెప్పిరి. కాబట్టి ప్రతివారును తమ మనస్సు ధ్యానకాలమున నిలుకడను బొందనిచో నిరుత్సాహపడక భగవాను డిచట బోధించినరీతిగ అభ్యాసముచే దానినెట్లైనను నిలుకడబొందునట్లు చేయవలెను. మోక్షమునకు వేఱుమార్గములేదు.

ప్ర:- మనస్సును దైవమందు స్థిరముగ నిలుపుడని చెప్పిరే, అట్లు మనస్సు నిలవనిచో ఏమి చేయవలెను?..

ఉ:- అభ్యాసముచే ఆ స్థితిని ఎట్లైనను సాధించవలెను?

అ॥ ఒకవేళ అట్టి అభ్యాసము కూడ చేతకానిచో అపుడేమి చేయవలెనో చెప్పుచున్నాడు -

**10. అభ్యాసేఽప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ
మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి.**

టీక:- అభ్యాసే అపి = అభ్యాసముచేయుటయందును, అసమర్థః అసి = సమర్థతలేనివాడవైనచో, మత్కర్మపరమః = నాసంబంధమగు కర్మలనొనర్చుటయం దాసక్తిగలవాడవు, భవ = అగుము, మదర్థమ్ = నాకొఱకు, కర్మాణి = కర్మములకును, కుర్వన్ అపి = చేయుచున్నను గూడ, సిద్ధిమ్ = (మోక్షసిద్ధిని), అవాప్స్యసి = పొందగలవు.

తా:- ఒకవేళ అభ్యాసముచేయుటయందును నీవసమర్థుడవైతివేని నా సంబంధమైన కర్మలజేయుటయం దాసక్తిగలవాడవు కమ్ము. అట్లు నాకొఱకు కర్మలను జేయుచున్నను గూడ నీవు మోక్షసిద్ధిని బడయగలవు.

వ్యాఖ్య:- ఒకవేళ పైన దెల్పిన చిత్తైకాగ్రతాభ్యాసమునుగూడ యెవరైన చేయజాలనిచో అట్టివారు తరించుటకై మఱియొక ప్రత్యామ్నాయ పద్ధతిని భగవానుడు కరుణతో సూచించుచున్నారు. మనోనిశ్చలత్వమును సాధింపలేనివాడు క్రమముగ దైవకార్యలందును, ధర్మకార్యములందు, పరోపకారక్రియలందు, పరప్రాణులకు హితమొనర్చుకార్యములందు ఆసక్తి గలిగి వానిని నిష్కామముగ నాచరించుచురావలయును. జపము, ప్రార్థన, కీర్తన, భజన, పూజ, వ్రతములు మున్నగువానిని భగవత్ప్రీత్యర్థము గావించుచుండవలెను. 'మత్కర్మపరమోభవ' అనుదాని యర్థమిదియే. దానిచే చిత్తము

శుద్ధముకాగా, క్రమముగ జ్ఞానమంకురింప, దానిచే మనుజుడు మోక్షసిద్ధిని బడయగలడు. ఈ ప్రకారముగ కర్మాచరణయు ఎట్టకేలకు ముక్తిని ప్రసాదించును. అతిసూక్ష్మమైన మనస్సును, సంకల్పములను అరికట్టలేనివారికి - ఈ కర్మమార్గము ఎంతయో సులభతరమైయుండగలదు. అయితే 'మదర్థం' అని భగవానుడు చెప్పెనే కాని 'త్వదర్థం' అని చెప్పలేదు. కావున ఆ యా క్రియలను దైవప్రీత్యర్థముగనే ఒనర్చవలెనుగాని, స్వార్థముకొఱకుగాదు. నిష్కామముగనే ఆచరించవలెనుగాని, సకామముగగాదు.

'కుర్వన్ సిద్ధి మవాప్స్యసి' - అను వాక్యము ద్వారా కర్మయోగమున్ను మోక్షసిద్ధికి హేతువుకాగలదని స్పష్టమగుచున్నది. ఎట్లనిన, ఆ కర్మలు, నిష్కామముగ, (దైవప్రీత్యర్థముగ) నాచరింపబడినచో చిత్తశుద్ధిని, తద్ద్వారా జ్ఞానమును, తద్ద్వారా మోక్షసిద్ధిని అవి కలుగజేయగలవు. అయితే నిష్కామాచరణకు మాత్రమే యిట్టి శక్తి కలదనియు, సకామాచరణకుగాదనియు నెఱుంగవలెను.

ప్ర:— మనస్సును పరమాత్మయందు నిలుపుటకై వలసిన అభ్యాసమునుగూడ ఎవ్వరైన చేయజాలనిచో అట్టివారు తరించుటకు మార్గమేమి?

ఉ:— వారు దైవకార్యములను, ధర్మకార్యములను, పరహితకార్యములను, నిష్కామబుద్ధితో నాచరించుచువచ్చిన క్రమముగ మోక్షసిద్ధిని బడయగలరు.

అ॥ అట్లు దైవసంబంధమైన కర్మాచరణము చేయజాలనిచో అత్తఱి తరించుటకేమి యుపాయమో తెలియజేయుచున్నాడు -

11. అథైతదప్యశక్తోఽసి కర్తుం మద్యోగమాశ్రితః
సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్.

టీక:— *అథ* = ఇకను, *మద్యోగమ్* = నన్నుగూర్చినయోగమును, *ఆశ్రితః* = ఆశ్రయించినవాడవై, *ఏతత్ అపి* = దీనినిగూడ, *కర్తుమ్* = ఆచరించుటకు, *అశక్తః అసి (చేత)* = సమర్థుడవుకానిచో, *తతః* = ఆ పిమ్మట, *యతాత్మవాన్* = నియమింపబడిన మనస్సుగలవాడవై (మనస్సును స్వాధీనపఱచుకొనినవాడవై), *సర్వకర్మఫలత్యాగమ్* = సమస్తకర్మములయొక్క ఫలములను విడిచిపెట్టుటను, *కురు* = చేయుము.

తా:— ఇక నన్ను గూర్చిన యోగము నవలంబించినవాడవై దీనినిగూడ నాచరించుటకు శక్తుడవుకానిచో అటుపిమ్మట నియమింపబడిన మనస్సు గలవాడవై సమస్తకర్మములయొక్క ఫలములను త్యజించివేయుము.

వ్యాఖ్య:— పైన తెలిపిన మూడుసాధనలున్ను చేయజాలనివారికి సులభమైన మఱియొక పద్ధతిని భగవాను డిచట సూచించిరి. ఉదయము నిద్రలేచినది మొదలు రాత్రి పరుండువఱకును మనుజుడు అనేక కార్యములు చేయుచుండునుగదా! ఆ యా కార్యములు చేయునపుడు దైవభావముగలిగి, తాను నిమిత్తమాత్రుడేయని భావించుకొని, సమస్తజగత్క్రియలు ఆ సర్వేశ్వరుడే జరుపుచున్నాడని నిశ్చయించుకొని, తాను చేయు ఆ సమస్తకార్యములయొక్క ఫలములను ఆ సర్వేశ్వరునకే అర్పించవలెను. అనగా ఫలాపేక్షను వదలి ఈశ్వరార్పణబుద్ధితో ఆ యా కర్మలను చేయవలెను. సమస్తకర్మలని చెప్పుటచే అసత్కార్యములు, పాపకార్యములుకూడ అనియెవరును భావించరాదు. ఏలయనిన అవి మొదటనే శాస్త్రములచే నిషిద్ధములై యున్నవి. కావున వాని నెవరును ఆచరించగూడదు. దానధర్మములు, వ్రతపూజాదులు, నిత్యనైమిత్తికకర్మలు

ఇంకను తనదినచర్యయందలి వివిధక్రియలు ఆచరించునపుడు దైవభావముగలిగి, ఆయా కర్మలయొక్క ఫలమును, ఈశ్వరార్పణము, (లేక కృష్ణార్పణము, రామార్పణము) గావించవలెను. పైన తెలుపుచు వచ్చిన పద్ధతులలో ఒక్కొక్కదానికంటె మఱియొకటి ఉత్తరోత్తర సులభతరమై యుండుటచే సాధకులలో ఎవరెవరికి ఏయే సాధన అనుకూలముగనుండునో, వారివారి మనస్తత్వములనుబట్టి దానిదానిని యేరుకొని, చక్కగ సాధించవచ్చును. చివరికి చెప్పబడిన ఈ సాధన అనగా తాను చేయు సమస్తకార్యములయొక్క ఫలములను భగవదర్పణము గావించుట యనుదానిని సామాన్యులుకూడ ఆచరించి తరింపవచ్చును. తాను నడచుచున్నచో అది భగవంతునకు ప్రదక్షిణమని భావించవలెను. మాట్లాడుచున్నచో అది దైవసంకీర్తనమని యెంచవలెను. ఈప్రకారముగ ఏపని చేయుచున్నను భగవత్స్మృతి గలిగి 'మామనుస్మర యుధ్యచ' అని గీతాచార్యులు తెలిపినవిధమున అట్టి దైవసంస్కారముతో తానాచరించుచు ఆయా కార్యములన్నిటియొక్క ఫలమును ఈశ్వరార్పణము గావించినచో, క్రమముగ పాపము నశించి, చిత్తశుద్ధిగల్గి జ్ఞానోదయమయి క్రమముగ మోక్షము లభించగలదు.

అయితే ఇట్టిస్థితి కలుగుటకు అనగా సర్వకర్మ ఫలత్యాగము చేయుటకు కొంతమనోనిబ్బరము, మనోనియమనశక్తి, ప్రయత్నము ఆవశ్యకమైయున్నది. కనుకనే 'యతాత్మవాన్' అని చెప్పబడినది. పట్టుదలతో ప్రయత్నపూర్వకముగ మనస్సును నియమించుకొనుచు (స్వాధీనమందుంచుకొనుచు) సర్వకర్మఫలత్యాగమను ఆ సులభతరమైన చక్కటి పరమార్థసాధనను జీవులు అమలునందుంచవలెను.

ప్ర:– క్రిందటి శ్లోకమందు తెలుపబడిన విధముగ దైవకార్యములను ఆచరించుటకు శక్తిలేని వారికి తరించుట కేదైన యుపాయము గలదా! ఉన్నచో అదియేమి?

ఉ:– కలదు, నియమితచిత్తుడై, తాను చేయు సమస్తకార్యములయొక్క ఫలమును ఈశ్వరార్పణము గావించుచుండవలెను. అదియే ఉపాయము.

అ॥ కర్మఫలత్యాగము యొక్క విశిష్టతను నిరూపించుచున్నాడు –

12. శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్.

టీక:– అభ్యాసాత్= (వివేకముతో గూడని) అభ్యాసముకంటె, జ్ఞానమ్ = (శాస్త్రజన్య) జ్ఞానము శ్రేయః హి= శ్రేష్ఠమైనది గదా!, జ్ఞానాత్= (శాస్త్రజన్య) జ్ఞానముకంటె, ధ్యానమ్= ధ్యానము, విశిష్యతే= శ్రేష్ఠమగుచున్నది, ధ్యానాత్= ధ్యానము (ధ్యానకాలమందు మాత్రము నిర్విషయముగనుండు మనఃస్థితి) కంటె, కర్మఫలత్యాగః= కర్మఫలమును విడుచుట (ప్రవృత్తియందును మనస్సు విషయదోషములేకుండుట), (విశిష్యతే = శ్రేష్ఠమగుచున్నది), త్యాగాత్ అనన్తరమ్ = (అట్టి కర్మఫల) త్యాగము చేసినవెనుక, శాన్తిః = శాంతి, భవతి = కలుగుచున్నది.

తా:– (వివేకముతోగూడని) అభ్యాసముకంటె (శాస్త్రజన్య) జ్ఞానము శ్రేష్ఠ మైనదికదా! (శాస్త్రజన్య) జ్ఞానముకంటె ధ్యానము శ్రేష్ఠమగుచున్నది. ధ్యానము (ధ్యానకాలమందు మాత్రము నిర్విషయముగనుండు మనఃస్థితి) కంటె కర్మఫలమును విడుచుట (ప్రవృత్తియందును విషయదోషములేకుండుట) శ్రేష్ఠమైయున్నది. అట్టి కర్మఫలత్యాగముచే శీఘ్రముగ (చిత్త) శాంతి లభించుచున్నది.

వ్యాఖ్య:— ఇచట అభ్యాసమని చెప్పినచోట వివేకముతోగూడని అభ్యాసమనియు, జ్ఞానమని చెప్పినచోట శాస్త్రజన్యజ్ఞానమని, ధ్యానమని చెప్పినచోట అసంపూర్ణమగు ధ్యానమని, ధ్యానకాలమందు మాత్రము విషయదోషములేని స్థితియని, అనగా ధ్యానాభ్యాసియొక్క స్థితియని గ్రహించుకొనవలెను.

'జ్ఞానాద్ధ్యానం విశిష్యతే' - 'వాచా' జ్ఞానముకంటె అనుభవపూర్వకమైన జ్ఞానము గొప్పది. జ్ఞానవిషయములను తదేకనిష్ఠతో చింతనచేయుటయే, అనుభూతమొనర్చుకొనుటయే ధ్యానము. కాబట్టి 'వాచా' జ్ఞానముకంటె శాస్త్రజన్యజ్ఞానముకంటె ధ్యానము గొప్పదని వచింపబడినది.

'ధ్యానాత్కర్మఫలత్యాగః' - కర్మఫలములను త్యజించువాని మనస్సు అసంగమై, విషయదోషము లేనిదైయుండును. ధ్యానాభ్యాసికి ధ్యానకాలమందు మాత్రము చిత్తము నిర్విషయమైయుండును. త్యాగికి ఎల్లప్పుడును అట్లేయుండును. కనుకనే ధ్యానముకంటె కర్మఫలత్యాగము శ్రేష్ఠమని చెప్పినారు. దీనిని బట్టి నిష్కామకర్మయోగమెంత మహిమ గలిగియున్నదో స్పష్టమగుచున్నది. జనులలో అధికులకు నివృత్తి కంటె ప్రవృత్తిసంస్కారమే ఎక్కువగ యుండియుండును. కాబట్టి అట్టివారు కర్మలనాచరించుచు కర్మఫలత్యాగమును చక్కగ అలవాటు చేసికొనినచో వారు ధ్యానాభ్యాసికంటె, జ్ఞానాభ్యాసికంటె గొప్పస్థానమును బొందినవారగుదురు. మఱియు భక్తికొఱకైనను, ధ్యానముకొఱకైనను, జ్ఞానము కొఱకైనను చిత్తశుద్ధి చాల అవసరము. అదియో, నిష్కామకర్మయోగముచే, కర్మఫలత్యాగముచే లభించుచున్నది. కాబట్టి అద్దానిని చక్కగ అనుష్ఠించినచో మాత్రమే - పునాది గట్టిగనున్నచో పైనగల మేడయు సుస్థిరముగ నుండునట్లు - ధ్యాన, జ్ఞానాదులన్నియుకూడ చక్కగ అభివృద్ధి నొందగలవు. కనుకనే భగవాను డీశ్లోకమున నిష్కామకర్మయోగము (కర్మఫలత్యాగము) యొక్క ప్రాశస్త్యమును వెల్లడించిరి.

'త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్' - కర్మఫలత్యాగముచే, ఈశ్వరార్పణ బుద్ధిచే చిత్తము శుద్ధమగుటవలన వెంటనే శాంతి ఉదయించుచున్నది. కర్తృత్వత్యాగమువలననే, అహంభావత్యాగమువలననే, దోషత్యాగమువలననే, ప్రాపంచికవిషయసుఖత్యాగమువలననే శాంతి లభింపగలదు. చిత్తమందలి దోషములు తొలుగుటయే శాంతికి మార్గము, (తేషాంశాన్తిశ్శాశ్వతీ నేతరేషామ్); ఏలయనగా నిర్మలచిత్తమున ఆత్మ ప్రత్యక్షముకాగలదు. దుఃఖభూయిష్ఠమగు ఈ సంసారమున ప్రతివాడును శాంతినే అభిలషించుచున్నాడు. కాని ఆ శాంతి యెట్లు లభింపగలదో తెలియజాలకున్నాడు. 'త్యాగాత్ శాంతిః' - త్యాగము వలననే శాంతిచేకూరునని భగవాను డిచట స్పష్టముగ తెలియజేసెను. కాబట్టి విషయసుఖములను, కర్మఫలములను, మమత్వమును, అహంభావమును, కర్తృత్వమును, త్యాగముచేసి పరమశాంతిని జీవుడనుభవించవలెను.

ప్ర:— కర్మఫలత్యాగముయొక్క మహిమయెట్టిదో పేర్కొనుము?

ఉ:— అది (వివేకముతోగూడని) అభ్యాసముకంటెను, (శాస్త్రజన్య) జ్ఞానముకంటెను, (ధ్యానకాలముమాత్రము నిర్విషయస్థితిగలిగియుండు) ధ్యానముకంటెను శ్రేష్ఠమైనది.

ప్ర:— శాంతి యెట్లు లభించును?

ఉ:— (కర్మఫల) త్యాగముచే.

అ॥ ఇంతదనుక భక్తియొక్క అంగములైన వివిధసాధనలను జెప్పి, ఇక ఏడు శ్లోకములద్వారా ఉత్తమభక్తుని లక్షణములను పేర్కొనుచున్నాడు -

13. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ.

14. సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః
మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తస్స మే ప్రియః.

టీక:— సర్వభూతానామ్ = సమస్తప్రాణులకును, అద్వేష్టా = ద్వేషి కానివాడును, మైత్రః = మిత్రభావముగలవాడును, కరుణః ఏవచ = దయగలవాడును, నిర్మమః = మమకారము లేనివాడును, నిరహంకారః= అహంకారములేనివాడును, సమదుఃఖసుఖః= సుఖదుఃఖములందు సమభావముగలవాడును, క్షమీ = ఓర్పు గలవాడును, సతతమ్ = ఎల్లప్పుడు, సంతుష్టః = సంతృప్తితో గూడియుండువాడును, యోగీ = యోగయుక్తుడై యుండువాడును (దైవమునందు చిత్తమును నియోగించువాడును), యతాత్మా = నియమింపబడిన మనస్సుగలవాడును(మనస్సును స్వాధీనపఱచుకొనినవాడును), దృఢనిశ్చయః = దృఢనిశ్చయముగలవాడును, మయి = నాయందు, అర్పిత = సమర్పింపబడిన, మనః బుద్ధిః = మనస్సు, బుద్ధి గలవాడును, మద్భక్తః= నాయందు భక్తిగలవాడును, యః= ఎవడు (కలడో), సః= అతడు, మే= నాకు, ప్రియః = ఇష్టుడు.

తా:— సమస్తప్రాణులయెడల ద్వేషములేనివాడును, మైత్రి, కరుణగలవాడును, అహంకారమమకారములు లేనివాడును, సుఖదుఃఖములందు సమభావముగలవాడును, ఓర్పుగలవాడును, ఎల్లప్పుడు సంతృప్తితో గూడియుండువాడును, యోగయుక్తుడును, మనస్సును స్వాధీనపఱచుకొనినవాడును, దృఢమైననిశ్చయముగలవాడును, నాయందు సమర్పింపబడిన మనోబుద్ధులుగలవాడును, నాయందు భక్తిగలవాడును ఎవడుకలడో, అతడు నాకు ఇష్టుడు.

వ్యాఖ్య:— ఎట్టివాడు తనకు ప్రియుడో భగవానుడు ఏడు శ్లోకములద్వారా చెప్పుచున్నాడు. ముప్పదియైదు సుగుణములను పేర్కొని 'ఇవి కలవాడే నాకుప్రియుడు' అని శ్రీకృష్ణపరమాత్మ తెలియజేయుచున్నారు. ఈ గుణములన్నియు 'అద్వేష్టా' అను పదముతో ప్రారంభమగుటచే 'అద్వేష్టృత్వాది' గుణములని ప్రసిద్ధికెక్కినవి. ఈముప్పదియైదున్ను మపప్పదియైదు పాఠములు, లేక పాఠ్యవిషయములు (Subjects) అయివున్నవి. విద్యార్థి పరీక్షలో అన్నిపాఠ్యవిషయములందును ఉత్తీర్ణుడైనచో మాత్రమే పై తరగతికి బోవుటకు అర్హత గలిగియుండు విధమున ఈ 35 సుగుణములను చక్కగ గలిగియుండువాడు మాత్రమే భగవంతునకు ప్రీతిపాత్రుడు కాగల్గును. ఇవి లేనివాడు భగవత్కృపకు పాత్రుడుకానందుచే ఆత డీ జననమరణసంసారప్రవాహమునబడికొట్టుకొనుచునే యుండును. దుఃఖమునుండి విడువబడవలెననిన, భగవదనుగ్రహమును సంపాదించవలెను. వారి యనుగ్రహమో ఈ సల్లక్షణములు, ఈ సద్గుణములు గలవానిపైననే ప్రసరించును.

సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి నప్రియః
యే భజన్తి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్. **(9-29)**

అని భగవానుడు చెప్పినరీతిగా, వాస్తవముగ వారికి ఎవనిపైనను ప్రీతిగాని, ద్వేషముగాని లేకున్నను ఎవరు వారిని భక్తితో సేవించుదురో వారిపై వారనుగ్రహమును వర్షించుదురు. అట్టి భగవదనుగ్రహమహిమచే

ఆత్మజ్ఞానమును, తద్ద్వారా ముక్తిని అతడు పొందియేతీరును. కాబట్టి మోక్షము నభిలషించువాడు, సంసారదుఃఖమును అంతరింప జేసికొనదలంచువాడు, భగవదనుగ్రహమును పొందుగోరువాడు ఈ అధ్యాయమందు తెలుపబడిన ఈ భక్తుని లక్షణములన్నిటిని చక్కగ శీలించవలెను.

అనేకులకు భగవంతునిపై ప్రీతి యుండును. కాని అది చాలదు. భగవంతునకు తనపై ప్రీతి జనించినదా యని పరీక్షించుకొనుచుండవలెను. దేవుడు జీవునకు ప్రియుడైనను, దేవునకు జీవుడు ప్రియుడుగానున్నాడా యని చూచుకొనవలెను. అట్టిస్థితి చేకూరెనా ఇక జీవుడు తరించినట్లే. అయితే భగవంతుడు తాను చెప్పిన ఈ సుగుణములు కలవానినే ప్రియుడుగ నెంచునని 'యోమద్భక్తః సమేప్రియః' మున్నగు వాక్యములద్వారా ఇట తెలియజేసిరి గావున వానిని జీవుడు తప్పక సంపాదించవలసియుండును.

సాధ్యవస్తువగు పరమాత్మను జేరవలెనన్న, సాధనయందు చక్కగ ఆరితేరవలెను. గీతాగ్రంథము సాధ్యవస్తువును గుఱించి ఒకింతయు, సాధననుగూర్చియే విశేషముగను తెలుపుచుపోవును. కనుకనే దీనిని అనుష్ఠాన వేదాంతగ్రంథమని చెప్పుదురు. మొట్టమొదట స్థితప్రజ్ఞలక్షణములు, తదుపరి అద్వేష్టృత్వాది భక్తలక్షణములు, ఆ పిమ్మట అమానిత్వాది జ్ఞానగుణములు, ఆ వెనుక 'అభయం' ఇత్యాది దైవీసంపత్తి లక్షణములు - ఈ ప్రకారముగ అనుష్ఠానమును గీతాచార్యులు జనులకు నూరిపోసిరి.

కాబట్టి ముముక్షువులు వానినన్నింటిని చక్కగ శీలించి భగవంతునకు ప్రీతిపాత్రులై జన్మసార్థకత నొందవలయును. 'సర్వభూతానామ్' - అని చెప్పుటవలన ఏ ఒకరిద్దరిపై ద్వేషములేకుండుట కాదనియు, సమస్తప్రాణికోట్ల యెడల ద్వేషరాహిత్యము కలిగియుండవలెననియు బోధింపబడినది.

'సంతుష్టః సతతమ్' - ఏ కొద్దిసేపో తృప్తిగలిగి మఱల విషయవాంఛలతో గూడియుండుట సరికాదు. ఎల్లప్పుడు సంతృప్తుడై యుండవలయును.

'దృఢనిశ్చయః' - దైవవిషయమునగాని, ప్రపంచవిషయమునగాని స్థిరమైన నిర్ణయములు కలిగి సాధనయందు గట్టి నిశ్చయములతో దృఢవ్రతములతో గూడియుండవలెను. శాస్త్ర, గురువాక్యములందు దృఢవిశ్వాసముండవలెను. ఇది 'ఔనో, కాదో' అను ఊగులాట పనికిరాదు. 'దేవుడున్నాడు, వారిని నేను పొందితీరెదను' అనునిట్టి దృఢనిశ్చయములు గల్గియుండవలెను. లేనిచో 'మాయ' చపలమనస్కుని ఊపివేయును.

'మయ్యర్పిత మనోబుద్ధిః' - మనస్సుతోబాటు బుద్ధినిగూడ తనయందు నిలుపవలెనని గీతయం దచటచట భగవానుడు హెచ్చరికలు చేయుచున్నారు. ఏలయనిన మనస్సు వికలాత్మకమైనది గనుక, నిశ్చయాత్మకమగు బుద్ధి దానితో చేరనిచో ఆ మనస్సు చంచలముగనేయుండి లక్ష్యమును సరిగా పొందజాలకుండును.

15. యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః
హర్షామర్షభయోద్వేగైర్ముక్తో యస్స చ మే ప్రియః.

టీక:- యస్మాత్ = ఎవనివలన, లోకః = ప్రపంచము (జనులు), న ఉద్విజతే = భయమును పొందరో, లోకాత్ చ = లోకమువలనగూడ, యః = ఎవడు, న ఉద్విజతే = భయమును పొందడో, యః = ఎవడు, హర్ష, అమర్ష, భయ, ఉద్వేగైః = సంతోషము, క్రోధము, భయము, మనోవ్యాకులత - అను వానిచే, ముక్తః = విడువబడినవాడో, సః చ = అతడును, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా:– ఎవనివలన ప్రపంచము (జనులు) భయమునుబొందదో, లోకమువలన ఎవడు భయమును బొందడో, ఎవడు సంతోషము, క్రోధము, భయము, మనోవ్యాకులత - మున్నగునవి లేకుండునో అట్టివాడు నాకు ఇష్టుడు.

వ్యాఖ్య:– 'లోకాన్నోద్విజతే' - సత్యమార్గమున జనువాడు ప్రపంచము యొక్క నిందాస్తుతులకు ఏ మాత్రము జంకగూడదు. నిర్భయుడై ముందుకు సాగి పోవలయును. (Be fearless) - .విగతభీః. అని యొకతూరి భగవానుడు సెలవిచ్చిన విషయమును జ్ఞాపకమునం దుంచుకొనవలెను.

'హర్షామర్షభయోద్వేగైః' హర్షము (సంతోషము) మంచిదే అయినను ఆవేశములకులోనై, స్తోత్రములకు ఉప్పొంగిపోవుటయు, నిందలకు క్రుంగిపోవుటయు కూడదనియు, ఆ ప్రకారము ద్వంద్వములకు లోబడక, నిర్వికారుడై సమభావముగలిగి యుండవలెననియు తెలుపుటయే యగును.

16. అనపేక్ష శ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః
సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః.

టీక:– *అనపేక్షః* = కోరికలులేనివాడును, *శుచిః* = బాహ్యాభ్యంతరశుద్ధిగలవాడును, *దక్షః* = కార్యసమర్థుడును (సమయస్ఫూర్తిగలవాడును), *ఉదాసీనః* = తటస్థుడును (దేనియందును తగలని మనస్సుగలవాడును), *గతవ్యథః* = దిగులు (దుఃఖము) లేనివాడును, *సర్వారమ్భపరిత్యాగీ* = సమస్తకార్యములందును కర్తృత్వమును వదలినవాడును (లేక సమస్తకామ్యకర్మలను, శాస్త్రనిషిద్ధకర్మలను త్యజించినవాడును), *మద్భక్తః*= నాయందు భక్తి గలవాడును, *యః*= ఎవడు (కలడో), *సః*= అతడు, *మే*= నాకు, *ప్రియః* = ఇష్టుడు.

తా:– కోరికలు లేనివాడును, బాహ్యాభ్యంతర శుద్ధిగలవాడును, కార్యసమర్థుడును, (సమయస్ఫూర్తిగలవాడును), తటస్థుడును, దిగులు (దుఃఖము) లేనివాడును, సమస్తకార్యములందు **కర్తృత్వమును** వదలినవాడును (లేక సమస్తకామ్యకర్మలను, శాస్త్రనిషిద్ధకర్మలను త్యజించినవాడును), నాయందు భక్తి గలవాడును, ఎవడు కలడో, అతడు నాకు ఇష్టుడు.

వ్యాఖ్య:– 'శుచిర్దక్షః' - గీతాచార్యులు శుచిత్వమును అచటచట నొక్కి చెప్పుచున్నారు. బాహ్యాభ్యంతరముల రెండిటియందును శుద్ధత్వమును కాపాడుకొనవలెను. తన శరీరము, తన వస్త్రములు, తన పరిసరము, తన మనస్సు - అన్నియు నిర్మలముగా నుండవలెను. మురికియందున్నవారికి మురికిభావనలే గలుగుచుండును. కావున దేహమనోనిర్మలత్వముల రెండిటిని కాపాడుకొనవలెను.

'దక్షః' - బహుసమర్థతతో, సమయస్ఫూర్తితో కార్యములను, ఆధ్యాత్మిక సాధనలను నిర్వహించుకొనుచు పోవలెను - అజాగ్రత్తగనున్నచో మాయ పడగొట్టి వేయగలదు.

'గతవ్యథః' - భక్తుడగువాడు అన్నిటికిని మూలాధారమైన భగవానుని ఆశ్రయించెను గనుక ఇక నాతనికి దిగులునొందవలసిన విషయ మీప్రపంచమున ఏదియునులేదు. కావున దిగులును, దుఃఖమును దరికి జేర్చరాదు.

'సర్వారమ్భపరిత్యాగీ' - కార్యములన్నిటిని సంపూర్ణముగ పరిత్యజించువాడనగా అకర్మణ్యుడనికాదు. దైవేతరములగు సమస్తకార్యములను త్యజించువాడని, లేక సమస్తకార్యములందును కర్తృత్వబుద్ధిని (doership) విడనాడువాడనియే అర్థము. లేక కామ్యకర్మలన్నిటిని త్యజించినవాడనియు, లేకశాస్త్రనిషిద్ధములగు సమస్త కర్మములను వదలువాడనియును చెప్పుకొనవచ్చును. కార్యమునందు కర్తృత్వమును, సంగమును వదలినవాడు కార్యముచేసినను చేయనట్లేయగును. కావున అట్టివాడు సర్వకార్యపరిత్యాగియేయగును.

17. యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాఙ్క్షతి
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః.

టీక:– యః = ఎవడు, న హృష్యతి = సంతోషింపడో (ఉప్పొంగడో), న ద్వేష్టి = ద్వేషింపడో, న శోచతి = శోకమును బొందడో, న కాఙ్క్షతి = కోరడో, యః = ఎవడు, శుభాశుభపరిత్యాగీ = శుభాశుభములను వదలినవాడో, సః భక్తిమాన్ = అట్టి భక్తుడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా:– ఎవడు సంతోషింపడో, ద్వేషింపడో, శోకమునుబొందడో, ఎవడు శుభాశుభములను వదలినవాడో అట్టిభక్తుడు నాకు ఇష్టుడు.

వ్యాఖ్య:– 'నహృష్యతి' - ఇచట సంతోషింపడనగా ఉప్పొంగిపోడని భావము. హర్షము (సంతోషము) మంచిదే అయినను అది హర్షశోకములను ద్వంద్వములలో చేరినదిగనుకను, మనోధర్మము గనుకను, పూర్ణమనోలయమునకు, నిరంతరాత్మస్థితికి అదియు ఒకానొక అడ్డే గనుకను ఆ ప్రకారముగ చెప్పబడినది.

'శుభాశుభపరిత్యాగీ' - ఇచట పాఠకులకొక సందేహముదయించవచ్చును - లోకములో అశుభమును వదలుటగదా ధర్మము. కాని ఇచట అశుభముతోబాటు శుభమునుగూడ పరిత్యజించువాడు - అని ఏల చెప్పబడెను? గీతావాక్యములను బహుజాగ్రతగ అర్థముచేసికొనవలసియుండును. పూర్వాపరములను సమన్వయించుకొనుచు, ఏ సందర్భమున ఏ భావముతో చెప్పబడెనో గమనించుచు అర్థమును గ్రహించవలసియుండును. ఇచట భక్తియొక్క పరాకాష్ఠస్థితి చెప్పబడుచున్నది. భక్తియొక్క చరమస్థితి, జ్ఞానస్థితి రెండును ఒకటే. పరిపూర్ణభక్తిగల మనుజుడున్ను, జ్ఞానియు ఇరువురును ఒకేదైవస్థితియందు, ఆత్మస్థితియందు నిలుకడగలిగియుందురు. అది మనస్సును, మనోవికారములను దాటిన జీవన్ముక్తస్థితి. అట్టిస్థితిలో శీతోష్ణసుఖదుఃఖ, హర్షశోక, శుభాశుభాది ద్వంద్వభావములెవ్వియు ఉండనేరవు. కేవలము దైవభావము, ఆత్మభావము ఒకటియేయుండును. కనుకనే పరిపూర్ణభక్తుడు శుభాశుభపరిత్యాగియని చెప్పబడెను. సాధకులు మొట్టమొదట శుభమును (శుభకార్యములను, శుభసంకల్పములను) గ్రహించి తద్ద్వారా అశుభమును (అశుభకార్యములను, అశుభసంకల్పములను) త్యజించివేయవలెను. తదుపరి నిస్సంకల్పాత్మస్థితియందు, కేవలదైవస్థితియందు ఆ శుభసంకల్పాదులున్ను వానియంతటనవియే తొలగిపోయి ఒకే దైవవస్తువు మాత్రము మిగులును. శుభాశుభపరిత్యాగమను పదముయొక్క భావమిదియే. అంతియేకాని శుభకార్యములను, పుణ్యకార్యములను త్యజించివేయవలెననికాదు. సాధుకులీ విషయమును బహుజాగ్రతగ గమనించవలెను.

18. సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః
శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సఙ్గవివర్జితః.

19. తుల్యనిన్దాస్తుతిర్మౌనీ సంతుష్టో యేనకేనచిత్
అనికేతః స్థిరమతిర్భక్తిమాన్మే ప్రియో నరః.

టీక:— శత్రౌ చ = శత్రువునందును, మిత్రే చ = మిత్రునియందును, తథా =అటులనే, మానావమానయోః = మానావమానములందును, సమః = సమముగా నుండువాడును, శీతోష్ణసుఖదుఃఖేషు = శీతము, ఉష్ణము, సుఖము, దుఃఖము - వీనియందు, సమః = సమముగానుండువాడును, సఙ్గవివర్జితః = దేనియందును సంగము (ఆసక్తి, మనస్సంబంధము) లేనివాడును, తుల్యనిన్దాస్తుతిః = నిందాస్తుతులందు సమముగానుండువాడును, మౌనీ = మౌనముతో నుండువాడును (లేక మననశీలుడును), యేనకేనచిత్ = దేనిచేతనైనను (దొరకినదానితో), సంతుష్టః = తృప్తినొందువాడును, అనికేతః = నిర్దిష్టమగు నివాసస్థానము లేనివాడును (లేక గృహాదులందాసక్తిలేనివాడును), స్థిరమతిః = నిశ్చయబుద్ధిగలవాడును, భక్తిమాన్ = భక్తిగలవాడును (అగు), నరః = మనుష్యుడు, మే = నాకు, ప్రియః = ఇష్టుడు.

తా:— శత్రువునందును, మిత్రునియందును, మానావమానములందును, శీతోష్ణసుఖదుఃఖములందును సమముగానుండువాడును, దేనియందును సంగము (ఆసక్తి, మనస్సంబంధము) లేనివాడును, నిందాస్తుతులందు సమముగా నుండువాడును, మౌనముతో నుండువాడును (లేక మననశీలుడును), దేనిచేతనైనను (దొరికిన దానితో) తృప్తిని బొందువాడును, నిర్దిష్టమగు నివాసస్థానము లేనివాడును (లేక గృహాదులం దాసక్తి లేని వాడును), నిశ్చయమగు బుద్ధిగలవాడును, భక్తితో గూడియుండువాడునగు మనుజుడు నాకు ఇష్టుడు.

వ్యాఖ్య:— ఈ రెండు శ్లోకములందును ఐదురకములైన ద్వంద్వములు చెప్పబడినవి - (1) శత్రుమిత్రులు (2) మానావమానములు (3) శీతోష్ణములు (4) సుఖదుఃఖములు (5) నిందాస్తుతులు - అని. అవి తటస్థించినపుడు ఏ విధమైన మనోవికారమును బొందక సమస్థితియం దుండువాడని యర్థము.

'మౌనీ' - మౌనము వాక్కునకే కాదు, మనస్సునకు గూడ నుండవలెను. భక్తుడు నిరంతరము దైవమందే లగ్నమైన చిత్తము గలిగియుండును గనుక ఎవరితోను అధికముగ మాటలు పెట్టుకొనడు; లేక 'మౌనీ' శబ్దమునకు మననశీలుడని, అనగా దైవమును గూర్చి సదా మననము చేయుచుండుననియు చెప్పవచ్చును.

'అనికేతః' - నికేతము (నివాసస్థానము) లేనివాడు అనికేతుడు. అనగా ఏ సమయమున ఏనివాసము దొరకునో, దానిచే సంతుష్టినొందువాడు, లేక ఒకచోటనున్నచో తాను నివసించు గృహాదులయెడలగాని, మఠాదులయెడలగాని మమత్వము, ఆసక్తి, సంగము లేనివాడని భావము. లేక 'నికేత' మనగా దేహమనియు చెప్పవచ్చును. అనికేతుడనగా దేహమునం దభిమానము లేనివాడు అని అర్థము.

'స్థిరమతిః' - అధ్యాత్మ (దైవ) విషయమునగాని, ప్రపంచ విషయమునగాని స్థిరమైన నిశ్చయములు గలవాడని భావము.

'భక్తిమాన్' - భక్తుడెట్టి లక్షణములు గలిగియుండవలెనో ఇంతదనుక చెప్పబడినది. ఈ ముప్పదియైదు సద్గుణములతో విరాజిల్లువాడే భక్తుడని పేర్కొనబడుటవలనను, అవియన్నియు జ్ఞానియొక్క లక్షణములుగనే తోచుచుండుటచేతను వాస్తవముగ పరాభక్తికిని, జ్ఞానమునకును భేదమేలేదని తేలుచున్నది. భక్తి గలవాడు

ప్రారంభస్థితియందు దేవుని పత్రపుష్పాదులతో పూజించుచుండును. కాని చిత్తము వికాసము నొందుచురాగా క్రమక్రమముగా సర్వాంతర్యామియగు ఆ యాత్మదేవుని తన మనఃపుష్పములచే పూజించును.

'సమర్ప్యైకశ్చేత స్సరసిజ ముమానాథ భవతే సుఖేనావస్థాతుం జనఇహ న జానాతి కిమహో '

'ఉమాపతిమగు ఓ పరమేశ్వరా! చిత్తమను కమలపుష్పమును మీకర్పించి సుఖముగ నుండుటను జనులు తెలిసికొనలేకున్నారే!' అని శ్రీశంకరభగవత్పాదులు శివానందలహరియందు తెలిపిన చందమున ఆ మనఃకుసుమములచే భక్తుడు భగవానుని ఆరాధించును. ఆ పుష్పములెవ్వి? ఈ అధ్యాయమునందు తెలుపబడిన ఆ ముప్పదియైదు సుగుణములే ఆ పుష్పములు.

మఱియు -

అహింసా ప్రథమం పుష్పం పుష్పమిన్ద్రియనిగ్రహః సర్వభూత దయాపుష్పం క్షమాపుష్పం విశేషతః శాన్తిపుష్పం తపః పుష్పం ధ్యానపుష్పం తథైవచ సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్.

అని చెప్పబడినట్లు అహింసా, ఇంద్రియనిగ్రహము, సర్వభూతదయ, క్షమ, శాంతి, తపస్సు, ధ్యానము, సత్యము అను యెనిమిది పుష్పములు విష్ణుభగవానునకు చాల ప్రీతికరములై యుండును. కావున బాహ్యపుష్పాదులతోబాటు ఈ సద్గుణరూపమనఃపుష్పములచేగూడ భగవానుని ఆరాధించుట శ్రేయోదాయకము. కాబట్టి ఈ అధ్యాయమందు తెలుపబడిన సద్గుణములన్నిటిని ముముక్షువు చక్కగ నభ్యసించి, భగవంతునకు ప్రీతిపాత్రుడు కావలయును.

ఈ ప్రపంచమున మనుజుడు సంపాదింపదగిన సమస్తపదార్థములందును సర్వోత్తమమైనది, అత్యంతమూల్యవంతమైనది ఈ భగవత్ప్రీతియే అయియున్నది. కావున దానిని తప్పక సంపాదింపవలయును. అయితే అది యెట్లు లభింపగలదు? ఈ అధ్యాయమందుగాని, గీతయందు తక్కినచోట్లగాని తెలుపబడిన సద్గుణరాశినంతను చక్కగ అవలంబించినచో భగవానుడు ప్రీతినొందుదురు. 'భక్తిమాన్ మే ప్రియోనరః' (అట్టి సుగుణములుగల భక్తుడు నాకు ప్రియుడు) - అని వారు చెప్పనే చెప్పిరి. ఒకనికి భగవంతునిపై ప్రీతియుండవచ్చునుగాని, భగవంతున కాతనిపై ప్రీతికలిగినదాయని ఆలోచించుకొనవలసియుండును. భగవద్వాక్యములకు, శాస్త్రవాక్యములకు వ్యతిరిక్తముగ నడచినచో మనుజుడు ఏకాలమందును భగవత్ప్రీతిని, భగవదనుగ్రహమును సంపాదించ జాలడు. కాబట్టి భగవత్ప్రోక్తములైన ఈ ముప్పదియైదు సుగుణములను జనులు అవలంబించి దైవానుగ్రహమునకు పాత్రులుకావలయును.

'నరః' - అని చెప్పినందువలన ఏ మానవుడైనను అట్టి స్థితిని అనగా భగవదనుగ్రహమును బడయవచ్చునని తెలిపినట్లైనది.

ప్ర:– ఈ అధ్యాయమున భక్తుని లక్షణములు మొత్తము ఎన్ని చెప్పబడెను? అవియేవి?

ఉ:– మొత్తము ముప్పదియైదు చెప్పబడెను. అవి క్రమముగ (1) ఏ ప్రాణిని ద్వేషింపకుండుట (2) మైత్రి (3) కరుణ (4) మమత్వములేకుండుట (5) అహంకారము లేకుండుట (6) సుఖదుఃఖములందు సమత్వము (7) ఓర్పు (8) నిత్యసంతుష్టి (9) మనోనిగ్రహము (10) దృఢనిశ్చయము (11) మనోబుద్ధులను భగవంతునకు సమర్పించుట (12) లోకమువలన తానుగాని, తనవలన లోకముగాని భయపడకుండుట (13) హర్షము, క్రోధము, భయము లేకుండుట (14) దేనియందును అపేక్షలేకుండుట (15) శుచిత్వము గలిగియుండుట (16)

కార్య సామర్థ్యము (17) తటస్థత్వము (18) మనోవ్యాకులత్వము లేకుండుట (19) సర్వకర్మ (ఫల) పరిత్యాగము (20) హర్షములేకుండుట (21) ద్వేషము లేకుండుట (22) శోకము లేకుండుట (23) కోరిక లేకుండుట (24) శుభాశుభపరిత్యాగము (25) శత్రుమిత్రులందు సమత్వము (26) మానావమానములందు సమభావము (27) శీతోష్ణములందు సమత్వము (28) సుఖ దుఃఖములందు సమభావము (29) సంగవర్జితత్వము (30) నిందాస్తుతులందు సమత్వము (31) మౌనము (32) దొరికినదానితో సంతుష్టి (33) నివాసమునం దభిమానము లేకుండుట (34) స్థిరబుద్ధి (35) భగవంతునియందు భక్తి.

ప్ర:— భగవంతునకు ప్రీతిపాత్రుడెవడు?

ఉ:— పైన దెల్పిన ఈ సుగుణములు కలవాడు.

ప్ర:— కాబట్టి భగవదనుగ్రహమును సంపాదించుట కుపాయమేమి?

ఉ:— ఈ సుగుణములన్నిటిని గలిగియుండుటయే.

అ॥ అధ్యాయాంతమున ఫలశ్రుతిని చెప్పుచున్నాడు -

20. యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే
శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః.

టీక:— యేతు = ఎవరైతే, శ్రద్ధధానాః = శ్రద్ధావంతులై, మత్పరమాః = నన్నే పరమగతిగా నమ్మినవారై (లేక, నాయందాసక్తిగలవారై), ఇదమ్ = ఈ, ధర్మ్యామృతమ్ = అమృతరూపమగు (మోక్షసాధనమైన) ధర్మమును, యథోక్తమ్ = ఈ (పైన) చెప్పబడిన ప్రకారము, పర్యుపాసతే = అనుష్ఠించుచున్నారో, తే భక్తాః = అట్టి భక్తులు, మే = నాకు, అతీవ = మిక్కిలి, ప్రియాః = ఇష్టులు.

తా:— ఎవరైతే శ్రద్ధావంతులై, నన్నే పరమగతిగ నమ్మి (నాయందాసక్తిగలవారై), ఈ అమృతరూపమగు (మోక్షసాధమైన) ధర్మమును (ఇప్పుడు) చెప్పబడిన ప్రకారము అనుష్ఠించుదురో అట్టిభక్తులు నాకు మిక్కిలి ఇష్టులు.

వ్యాఖ్య:— పైనతెలుపబడిన ధర్మములను శ్రద్ధాభక్తులతో అనుష్ఠించువారికి కలుగు ఫలితమును వచించుచున్నారు. ఏదియైన ధర్మమును బోధించునపుడు దానిఫలితమునుగూడ చెప్పినచో ఆచరించువారికి దానిపై పరమవిశ్వాస మేర్పడుచుండును. అందువలననే కాబోలు భగవానుడు భక్తునిలక్షణములను పేర్కొనిపేర్కొని కట్టకడకు వాని ననుష్ఠించుటవలన కలుగు గొప్పఫలితమును చెప్పివైచిరి. ఆ ఫలితమేమి? 'తే అతీవ మే ప్రియాః' - భగవంతునకు పరమప్రీతిపాత్రులగుటయే. ఇంతకుమించిన ఫలము జీవుల కేమికావలయును? అదియున్నచో అన్నియు లభించినట్లే. అది లేనిచో తక్కినవి యెన్నియున్నను నిరుపయోగములే - భగవత్కృపకు మించినవస్తువు ముల్లోకములందును మఱియొకటిలేదు. ఏలయనగా, అట్టి కృప మోక్షమునకు దారితీయును. ఎట్లనిన భగవదనుగ్రహముగలవారికి బుద్ధియోగము (తత్త్వవిచారణాశక్తి) సంప్రాప్తించును. (దదామిబుద్ధియోగమ్) దానిచే నతనికి మోక్షము సన్నిహితమగును.

'ధర్మ్యామృతమ్' - పైనతెలుపబడిన ధర్మములు అమృతరూపమున వర్ణింపబడినవి. ఎందువలననగా,

జననమరణములనుండి తప్పించగల సామర్థ్యము వానియందు గలదు. జీవుని అమరునిగ చేయగలశక్తి వానియందు గర్భితమైయున్నది. భగవానుడు కరుణతో అమృతవర్షమును కురిపించిరి. వారివారి బుద్ధియనుపాత్రనిండుగ ఆ అమృతమును పట్టి తనివితీర త్రాగుట జీవులధర్మము. ఎవరట్లుచేయరో వారు ఆ అమృతమును త్రావు సౌభాగ్యమును చేతులారా జారవిడుచుకొనినవారే యగుచు సంసారదాహపీడితులై దుర్భరయాతనల ననుభవించవలసివచ్చును. అయితే ఆ ధర్మముల నేప్రకారమనుష్ఠించవలెను?

'శ్రద్ధధానాః' - శ్రద్ధతో ననుష్ఠించవలెనని చెప్పబడినది. ఒకతూరికాదు, రెండుతూర్లుకాదు, భగవానుడనేకతూర్లు ఈశ్రద్ధయొక్క ఆవశ్యకతను గీతయందు పేర్కొనుచుండుట గమనింపదగియున్నది. మఱియు 'మత్పరమాః' - పరాత్పరుడే పరమగతియని నమ్మి వారిని ధ్యానించుచు అ యా సుగుణములను, ధర్మములను అనుష్ఠింపవలెను. 'అతీవమేప్రియాః' అని చెప్పుటవలన, ఆ ప్రకారమాచరించువారు తనకు మిక్కిలి ప్రియులని గీతాచార్యులభావమైయున్నది. పాఠశాలలో ఉపాధ్యాయునకు ప్రీతిపాత్రుడైయుండు విద్యార్థియొక్క భవిష్యద్విద్యాభివృద్ధివిషయమై ఏలాటి సంశయ మెట్లుండదో, తండ్రియొక్క అభయహస్తముక్రిందనున్న చంటిపిల్లవానియొక్క యోగక్షేమములవిషయమై ఏ సందేహమున్ను ఎట్లుండదో, అట్లే భగవంతునకు మిక్కిలి ప్రీతిపాత్రుడై యుండుజీవునియొక్క మోక్షవిషయమై ఏ సందియమున్ను ఉండదు. ఆతడు కడతేరినట్లేయగును. కాబట్టి ముముక్షువులు త్వరబడి భగవత్ప్రోక్తమగు ఈ ధర్మ్యామృతమును తనివితీర పానముచేసి కృతార్థులగుటకై యత్నింపవలయును. 'యేతు' - అని 'యచ్ఛబ్ద' ప్రయోగము చేయుటవలన ఎవ్వరైననుసరియే వానిని శ్రద్ధతో ననుష్ఠించినచో మోక్షభాగులు కాగల్గుదురని భావము.

ప్ర:– శ్రీకృష్ణమూర్తి బోధించిన ఈ ధర్మములెట్టివి?

ఉ:– అమృతరూపములు, జననమరణములనుండి తప్పించి జీవుని అమరునిగ (ముక్తునిగ) చేయగలిగినవి.

ప్ర:– ఈ ధర్మముల నేప్రకార మాచరించవలెను?

ఉ:– శ్రద్ధతో, భగవంతునియెడల అపారమైన భక్తితో.

ప్ర:– అట్లాచరించినందువలన కలుగు ఫలితమేమి?

ఉ:– వాని నాచరించువాడు భగవానునకు మిక్కిలి ప్రీతిపాత్రుడు కాగల్గును.

ఓమ్
ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే భక్తియోగో నామ
ద్వాదశోఽధ్యాయః
ఇది ఉపనిషత్ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జున
సంవాదమునగు శ్రీ భగవద్గీతలందు భక్తియోగమను
పండ్రెండవ అధ్యాయము
ఓమ్ తత్ సత్

